సాక్షి
నారాయణపేట
సోమవారం । 3 । ఏప్రిల్ । 2023



మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం
మహబూబ్‌నగర్‌లో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం శరవేగంగా జరుగుతోంది.
వివరాలు 8లో ▸



..తరిమికొడదాం
దేశం, రాష్ట్రంలోని రాక్షసుల రాజ్యాన్ని తరిమికొడదామని ఎమ్మెల్యే సీతక్క అన్నారు.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
37.2 /23.6

వాతావరణం
రోజంతా ఎండ తీవ్రత సాధారణంగా ఉంటుంది. అప్పుడప్పుడూ ఆకాశం తేలిక పాటి మేఘావృతమై ఉంటుంది.

ఇఫ్తార్ 6-31
(సోమవారం సాయంత్రం)
సహర్ 4-59
(మంగళవారం తెల్లవారుజామున)
రంజాన్ వేళలు

ప్రయాణికుల సేవలో..

పండుగ రోజుల్లో ప్రత్యేక సర్వీసులు

- బస్సుల్లో పెరుగుతున్న ప్రయాణికుల ఆక్యుపెన్సీ
- దసరాకి రూ.12.50 కోట్లు, సంక్రాంతికి రూ.10.25 కోట్ల ఆదాయం
- వందరోజుల ప్రణాళికతో రీజియన్‌కు మెరుగైన ఫలితాలు



మహబూబ్‌నగర్ రీజియన్‌లో డిపోలు 10
మొత్తం బస్సులు 842
పండుగ సీజన్లలో వచ్చిన ఆదాయం రూ.39.3కోట్లు

స్టేషన్ మహబూబ్‌నగర్:

ఆర్టీసీ బస్సుకు మధ్య తరగతి ప్రజలకు విడదీయలేని బంధం ఉంది. సామాన్య ప్రజలకు ఆర్టీసీ బస్సు ప్రధాన రవాణా సాధనంగా ఉపయోగపడుతుంది. కరోనా మహమ్మారి సమయంలో ఆర్టీసీ ఆదాయం గణనీయంగా తగ్గింది. కానీ, ప్రస్తుతం ఆర్టీసీ ఆదాయం మరింతగా పుంజుకుంటోంది. బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. అన్ని రూట్లలో బస్సులు నడపుతుండటంతో ప్రజలు ఆర్టీసీని ఎక్కువగా వినియోగించుకుంటున్నారు. మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌లో 10 డిపోలు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, అచ్చంపేట, గద్వాల, కొల్లాపూర్, షాద్‌నగర్, నారాయణపేట, కల్వకుర్తి, కోస్గి ఉన్నాయి. వీటి పరిధిలో 842 బస్సులు ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి.

వందరోజుల ప్రణాళికతో..

ఆర్టీసీ సంస్థను గాడిలో పెట్టడానికి యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. గతేడాది ఏప్రిల్ 10 నుంచి జూలై వరకు ఆర్టీసీ వందరోజుల ప్రణాళిక ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. అన్ని రూట్లలో బస్సులను నడిపించి ప్రయాణికులకు సేవలు అందించారు. దీంతో మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌కు మెరుగైన ఫలితాలు వచ్చాయి. ఈపీకేలో గతంలో ఎన్నడూ లేని విధంగా మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ మంచి వృద్ధి రేటు సాధించింది. ఈపీకే (ఎర్నింగ్స్ ఫర్ కిలోమీటర్) వృద్ధి రేటులో తెలంగాణలో మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ అవార్డును దక్కించుకుంది. వంద రోజుల ప్రణాళికలో రీజియన్ ఈపీకే 32.89 లక్ష్యం కాగా.. 37 శాతం, ఆక్యుపెన్సీ రేషియా 69.07 ఉండగా 71.24 శాతం, కిలోమీటర్లకు సంబంధించి రీజియన్ 12.52 శాతం, ఆదాయంలో 26.57 శాతం వృద్ధి రేటును పొందడం విశేషం. డిపోల పరంగా ఈపీకేలో వనపర్తి 38.42, అచ్చంపేట 37.56, మహబూబ్‌నగర్ డిపో 37.52 సాధించాయి.

పండుగల్లో రీజియన్ ఆదాయం వివరాలు

పండుగ	బస్సులు	ఆదాయం (రూ.లలో..)	కిలోమీటర్లు	ప్రయాణికులు
దసరా	345	12,56,05,950	29,89,207	23,07,547
దీపావళి/కురుమూర్తి	330	9,12,94,371	23,94,415	17,45,217
సంక్రాంతి	360	10,25,32,654	25,91,044	19,28,274
శివరాత్రి	370	7,17,76,909	16,49,325	13,14,922

మెరుగైన సేవలు..



ఆర్టీసీ నుంచి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. పండుగల సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అదనపు సర్వీసులు నడుపుతున్నాం. అన్ని బస్టాండ్లలో సౌకర్యాలు కల్పిస్తున్నాం. బస్టాండ్లలో మిషన్ భగీరథ మంచినీటి వసతి కల్పించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. వేసవి దృష్ట్యా బస్టాండ్లలో చల్లటి నీటి కూలర్లు ఏర్పాటు చేయనున్నాం. ఆర్టీసీ ఉద్యోగులకు హెల్త్‌చాలెంజ్ ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మెరుగైన వైద్యం తార్నాక ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నాం. డ్రైవర్, కండక్టర్లు, ఇతర ఉద్యోగుల ఆరోగ్యం కోసం ప్రతి డిపోలో ఒక మహిళ, ఒక పురుష ఉద్యోగులను హెల్త్ వలంటీర్లుగా నియమించనున్నాం. ఆర్టీసీలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి డ్రైవర్లకు అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం.
– శ్రీదేవి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, మహబూబ్‌నగర్

దసరా ఆదాయం అదుర్స్..

ప్రతి ఏడాది దసరా పండుగ రోజుల్లో ఆర్టీసీ మెరుగైన ఆదాయం వస్తుంది. దసరా పండుగను పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం మహబూబ్‌నగర్ రీజియన్‌లో 345 ప్రత్యేక అదనపు సర్వీసులు నడిపారు. గతేడాది సెప్టెంబర్ అక్టోబర్ 1 నుంచి 10 వరకు ప్రత్యేక బస్సులు నడిపారు. అదేవిధంగా దసరాకు ఎంజీబీఎస్ మీదుగా ఏపీలోని పలు ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపారు. దసరా పండుగ పది రోజుల్లో మహబూబ్‌నగర్ రీజియన్ రూ.12.50 కోట్లపై ఆదాయం సాధించింది. అక్టోబర్ 10న మహబూబ్‌నగర్ రీజియన్ గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో రూ.1,76,24,718ల ఆదాయం వచ్చింది. 3,41,200 కిలోమీటర్లు బస్సులు నడవగా ఈ ఆదాయం వచ్చింది. 88.01 ఆక్యుపెన్సీ రేషియా (ఓఆర్) సాధించింది. ఇదేరోజు రీజియన్ ఈపీకే లక్ష్యం 41.73 శాతం ఉంటే 51.66 శాతాన్ని నమోదు చేసింది. డివిజన్ల వారీగా మహబూబ్‌నగర్ రూ.87,98,600, నాగర్‌కర్నూల్ రూ.88,26,118ల ఆదాయం పొందింది. డిపోల పరంగా మహబూబ్‌నగర్ డిపో రికార్డు స్థాయిలో ఆదాయం సాధించింది.

➡ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని 9 డిపోల నుంచి 360 అదనపు బస్సు సర్వీసులను నడిపారు. ఈ ఏడాది జనవరి 7 నుంచి 14 వరకు అదనపు బస్సులు నడవనున్నాయి. అన్ని డిపోల నుంచి అదనపు సర్వీసులు హైదరాబాద్ వరకు తిరిగాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రజలు సంక్రాంతి పండుగకు ఎక్కువ సంఖ్యలో వారి స్వస్థలాలకు వచ్చే అవకాశం ఉండడంతో హైదరాబాద్‌కు అదనపు సర్వీసులు నడిపారు. 7 నుంచి 14 వరకు మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ రూ.10.25 కోట్ల ఆదాయాన్ని సాధించింది. 12న రూ.1,68,75,167ల అధిక ఆదాయాన్ని ఆర్జించింది. రీజియన్‌లోని ఆర్టీసీ ప్రైవేట్ హైర్ 842 బస్సులు 3,41,861 కిలోమీటర్లు బస్సులు నడవగా ఈ ఆదాయం వచ్చింది. అదేవిధంగా 13న రీజియన్‌కు రూ.1,60,24,876ల ఆదాయం రాగా 3,41,580 కిలోమీటర్లు నడిచాయి.

➡ మహాశివరాత్రిని పురస్కరించుకొని శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఫిబ్రవరి 14 నుంచి 19 వరకు రీజియన్‌లోని డిపోల నుంచి 370 ప్రత్యేక అదనపు సర్వీసులు నడిపారు. శివరాత్రికి మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌కు రూ.7 కోట్లకుపైగా ఆదాయం వచ్చింది. అదేవిధంగా కురిమూర్తి జాతరకు రీజియన్‌లోని ఐదు డిపోల నుంచి అక్టోబర్ 31 నుంచి మూడు రోజులపాటు 250 బస్సులను నడపగా.. రూ.2.24 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. దీపావళితోపాటు ఆయా జాతరలకు సంబంధించి రీజియన్ రూ.5.28 కోట్ల ఆదాయం పొందింది.



మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ (ఫైల్)

➡ అయ్యప్పస్వాముల సౌకర్యార్థం శబరిమలైకు మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలోని అచ్చంపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, షాద్‌నగర్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపించగా రూ.42,88,080 ఆదాయం వచ్చింది. 36 మందితో కూడిన అయ్యప్పస్వాములు శబరిమలైకు వెళ్లడానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను నడిపారు.

న్యూస్‌రీల్

విద్యతోపాటు క్రమశిక్షణ నేర్పించాలి



నారాయణపేట: ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ నేర్పించాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని అశోక్‌నగర్ సరస్వతి శిశు మందిరం 20వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదే పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఎంబీబీఎస్, ఇంజినీరు సీట్లు సాధించిన వారికి పాఠశాల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శులు మురళీధర్, శేషమ్మ, సరస్వతి శిశుమందిరాల జిల్లా అధ్యక్షుడు బాలరాజు, కార్యదర్శి సీతారాములు శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన ఉమ్మడి జిల్లా ఆర్‌ఎస్‌ఎస్ బౌద్ధిక్ ప్రముఖ్ శ్రీధర్ బసుదే మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి విద్యార్థి ఆంగ్ల, తెలుగు భాషలో రాణిస్తూ ఉన్నత స్థాయి రాణించాలన్నారు. ప్రతిఒక్కరూ శిశుమందిరంలో చదవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. నేటి కాలానికి అనుగుణంగా ఆంగ్లంతోపాటు కంప్యూటర్ టెక్నాలజీ అందిస్తున్న ఏకైక పాఠశాల శిశుమందిరం ఒక్కటే అన్నారు. అంతకు ముందు బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగురావు నామాజీ మాట్లాడుతూ క్రమశిక్షణకు మారు పేరు శిశు మందిరం అని, ప్రతిఒక్కరూ తమ పిల్లలను శిశుమందిరంలో చేర్పించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నాటకాలు, దేశభక్తి గేయాలు, నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో శిశుమందిర్ సమన్వయకర్త శేర్ కృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి కుర్మన్న, వెంకట్రాములు, శిశు మందిరం ప్రధానాచార్యులు విజయలక్ష్మి, దత్తు చౌదరి, శారదాదేవి, ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

పత్తి @ రూ.7,600

నారాయణపేట: జిల్లాలోని వివిధ కాటన్ మిల్లులలో ఆదివారం మొదటి రకం పత్తి క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7,600, కనిష్టంగా రూ.7 వేలు ధర పలికింది. రెండో రకం పత్తి గరిష్టంగా రూ.6,500, కనిష్టంగా రూ.6 వేలు, పర్గే పత్తి గరిష్టంగా రూ.5 వేలు, కనిష్టంగా రూ.4,500 చొప్పున ధర లభించింది.

కల్వకుర్తి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఆదివారం భారీగా వేరుశనగను రైతులు విక్రయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వేరుశనగ క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7,723, సరాసరిగా రూ.7,300, కనిష్టంగా రూ.5,866 చొప్పున లభించింది. 187 మంది రైతులు 1,557 క్వింటాళ్ల వేరుశనగను అమ్మకానికి తెచ్చారు. వేరుశనగతోపాటు ఆముదాలు, కందులు విక్రయానికి వచ్చాయి. ఆముదాలకు క్వింటాల్ గరిష్టంగా రూ.6,007, కనిష్టంగా రూ.5,907, కందులకు సరాసరిగా రూ.5,116 ధర లభించింది.

‘బీసీబంధు’ అమలు చేయండి



గద్వాల: తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీలపై చిన్నచూపు చూస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ గణతే, రాష్ట్ర కోశాధికారి చింతల సురేందర్ యాదవ్ విమర్శించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన ఓబీసీ సమావేశానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ‘పల్లెపల్లెకు ఓబీసీ– ఇంటింటికీ బీజేపీ’ వాల్ పోస్టర్లును విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళితబంధు తరహాలో బీసీబంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఓబీసీల సంక్షేమానికి ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ నెల 6 నుంచి 14 వరకు ఓబీసీ కార్యక్రమాలు చేపడుతామని వివరించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతామన్నారు. నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, నాగేందర్, రామంజనేయులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిటీని ప్రకటించాలి



మాట్లాడుతున్న శేర్‌కృష్ణారెడ్డి

నారాయణపేట రూరల్: గతేడాది నుంచి బకాయిపడ్డ డీఏలతోపాటు 2023 జూలైలో ప్రకటించాల్సిన పీఆర్‌సీకి సంబంధించిన కమిటీని వెంటనే ప్రకటించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పదోన్నతులు, బదిలీలను ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషిచేయాలన్నారు. పండిత్, పీఈటీల అప్‌గ్రెడేషన్ ప్రక్రియకు సంబంధించి సామరస్య పూర్వకమైన పరిష్కారాన్ని చూపించాలన్నారు. జీఓ 317 బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయడానికి ప్రణాళిక సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌టీఓలో పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేసి, ప్రతి నెల 1న జీతాలు ఇచ్చేలా చూడాలన్నారు. సమావేశంలో గౌర వాధ్యక్షుడు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి నర్సింహ, కోశాధికారి కిశోర్, నాయకులు సురేష్, సీతారాములు, బాలరా జు, నాగార్జునరెడ్డి, మాణిక్‌ప్రభు, విశ్వనాథ్, రవికు మార్, శ్రీనివాస్, శంకర్‌నాయక్, చిన్ననర్సింహులు, కరుణాకర్, శ్రీనాథ్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

నారాయణపేట: ఉమ్మడి జిల్లాలో సూర్యప్రతాపం మొదలైంది. ఎండల తీవ్రత రోజురోజుకు అధికమవుతోంది. 20 రోజుల్లో పది డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు పెరగడంతో జనం తల్లడిల్లుతున్నారు. ఆదివారం జిల్లాలో అత్యధికంగా 37.2డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. ఇప్పటి వరకు ఈ ఏడాది మార్చి 31న జిల్లాలో 38.4 అత్యధిక ఉష్ణోగ్రత కావడం విశేషం. ఉదయం 9 గంటలకే భానుడి భగభగలు మొదలై సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగుతున్నాయి. పనులమీద బయటకు వస్తున్న ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాకేంద్రంతోపాటు మరో ఎనిమిది మండలాల్లో ప్రతిరోజూ 38 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మహబూబ్‌నగర్, నారాయణపేట నుంచి రాయచూర్ ప్రధాన రహదారులతోపాటు పట్టణాలు, గ్రామాల్లోని రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

జిల్లాలో ఐదు రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీలలో)

తేదీ	గరిష్టం	కనిష్టం
మార్చి 29	36.2	21.4
మార్చి 30	37.1	23.5
మార్చి 31	38.4	24.1
ఏప్రిల్ 1	37.5	22.3
ఏప్రిల్ 2	37.2	23.6

నేటినుంచి ‘పది’ పరీక్షలు



జిల్లాకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం తనిఖీ చేస్తున్న జిల్లా పరీక్షల విభాగం అధికారి

- జిల్లావ్యాప్తంగా 38 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 7,611 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యా శాఖాధికారులు

నారాయణపేట రూరల్: జిల్లావ్యాప్తంగా ప్రారంభమయ్యే పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 7,611 మంది విద్యార్థులకు గాను 38 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిని రెగ్యులర్ విద్యార్థులకు కేటాయించగా.. ప్రైవేటుగా రాసేవారు కేవలం 47 మంది మాత్రమే ఉండటంతో జిల్లాకేంద్రంలోని బాలికల పాఠశాల కేంద్రంలో వారిని కలిపేశారు. వీటిలో 16 కేంద్రాలు ఏ కేటగిరీలో ఉండగా.. మరో 15 బి కేటగిరీకి చెందినవి ఉన్నాయి. దీనికి తోడు 7 కేంద్రాలు సీ కేటగిరిలో ఉండటంతో వాటికి ప్రత్యేకంగా ఒక్కొక్క సీ కస్టోడియన్‌తోపాటు ఒక వాహనం ఏర్పాటు చేశారు. ఇక ప్రశ్నపత్రాల స్టోరేజ్ పాయింట్లకు 10 పోలీసు స్టేషన్లను వినియోగించుకుంటున్నారు. సోమవారం నుంచి ఈ నెల 11 వరకు ఇచ్చిన షెడ్యూల్‌లో కేవలం 6 పరీక్షలను మాత్రమే నిర్వహిస్తుండగా.. ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. అరగంట ముందే కేంద్రంలోకి వదులుతారు. ఐదు నిమిషాలు ఆలస్యమైతే (9.30 గంటల) తర్వాత అనుమతి ఉండదు.

సిబ్బంది కేటాయింపు పూర్తి..

పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం బుధవారం వరకు కొనసాగింది. జిల్లావ్యాప్తంగా 38 చీఫ్ సూపరింటెండెంట్లు, 40 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించి వారికి రెండు దఫాలుగా శిక్షణ ఇచ్చారు. అలాగే ఆరుగురు సీ కస్టోడియన్లుగా, 10 చోట్ల పోలీస్‌స్టేషన్లను ప్రశ్నపత్రాల స్టోరేజ్ పాయింట్స్‌గా ఏర్పాటు చేశారు. ఇక సుమారు 362 మంది ఇన్విజిలేటర్లుగా ఎంపిక చేసి సంబంధిత పరీక్ష కేంద్రాలకు పంపించారు. ఈ మేరకు వారికి ఆయా సీఎస్, డీఓలు సమావేశం నిర్వహించి శిక్షణ ఇచ్చారు. దీనికి తోడు ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి డీఈఓతో సహా మరో 10 సిట్టింగ్, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. అలాగే పరీక్షలు జరిగే సమయంలో సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూయించడంతోపాటు ప్రతి సెంటర్ దగ్గర పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

పకడ్బందీగా నిర్వహిస్తాం..



గతంలో జరిగిన పరీక్షల్లో చోటుచేసుకున్న పొరపాట్లను అధిగమిస్తూ పకడ్బందీగా పది పరీక్షలను పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాం. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సదుపాయాలు, ఫర్నీచర్, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలు కల్పించాం. సీసీ కెమెరాలను అవసరం మేరకు ఉపయోగిస్తాం. – లియాకత్‌అలీ, డీఈఓ

పరీక్ష కేంద్రాల్లో అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనపై ఎంఈఓలు, కస్టోడియన్లు దృష్టి సారించారు. తాగునీరు, ఫర్నీచర్, మరుగుదొడ్లు తదితర వాటిని ఏర్పాటు చేశారు. ఇక విద్యుత్ సౌకర్యంతోపాటు వేసవిలో ఉక్కపోత నుంచి విద్యార్థులకు ఊరట కల్పించేందుకు ఫ్యాన్లు బిగించారు. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ వాటి వినియోగంపై సందిగ్ధత నెలకొంది. జిల్లా

వసతుల కల్పన

విద్యాశాఖ ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. సందేహాలు, సలహాలు, సూచనల కోసం టోల్‌ఫ్రీ నం.78937 01990కు ఫోన్ చేయాలని సూచించింది.

నిబంధనలు ఇలా..

- పరీక్ష కేంద్రానికి అరగంట ముందు చేరుకోవాలి
- ప్రైవేటు విద్యార్థులు యూనిఫాం ధరించరాదు
- సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకుపోరాదు
- హాల్‌టికెట్, ప్యాడ్‌తోపాటు వాటర్ బాటిల్, కర్చీఫ్ వెంట తెచ్చుకోవాలి
- వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌తో పరీక్షకు హాజరుకావచ్చు.

సర్వాయి పాపన్నకు ఘన నివాళి



సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

నారాయణపేట: బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి బీసీ అభివృద్ధి అధికారి కృష్ణమాచారి, సాంఘిక సంక్షేమ అధికారి కన్యాకుమారి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వాయి పాపన్న గొప్ప విప్లవకారుడు అని కొనియాడారు. అతని సేవలను, జీవిత చరిత్రను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. సర్వాయి పాపన్న వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా చేపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

బీసీ బాలికల వసతి గృహ పదో తరగతి విద్యార్థినులకు పరీక్ష కిట్ (కాంపాక్స్, పెన్నులు, పెన్సిల్, స్కేల్, ప్యాడ్)లను బీసీ అభివృద్ధి అధికారి కృష్ణమాచారి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు మెలకువలను వివరించారు. పరీక్షలు మంచిగా రాసి అత్యధిక మార్కులు సాధించి తల్లిదండ్రులకు, హాస్టల్‌కు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. వసతి గృహంలో విద్యార్థులకు 24 గంటలు అందుబాటులో ఉండి బాగోగులు, ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వసతి గృహ సిబ్బందిని ఆదేశించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సాగునీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి

మాగనూర్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా మక్తల్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఆదివారం మండలంలోని నేరడగం జీరో పాయింట్ సమీపంలోని కుడి హైలెవల్ కాల్వకు నీరును మోటార్ల ద్వారా దిగువకు విడుదల చేశారు. వేసవి కావడంతో సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నీటిమట్టం తగ్గడంతో నెలకొన్న సాగునీటి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరడంతో స్పందించిన ఎమ్మెల్యే వెంటనే జేసీబీ ద్వారా కాల్వలో పిచ్చి మొక్కలను తొలగించడంతోపాటు పంపు ద్వారా నీటిని కాల్వలోకి విడుదల చేసి పంటలు ఎండిపోకుండా చేశారు. దీంతో ఆయా గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేశారు. రైతులకు ఎప్పుడు ఏ కష్టం వచ్చిన వారికి వెన్నంటే ఉంటూ సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే ముందున్నారని నేరడగం ఎంపీటీసీ సభ్యుడు ఎల్లారెడ్డి అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అశోక్‌గౌడ్, మైపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఎల్లారెడ్డి, మల్‌రెడ్డి, ఈశ్వర్‌యాదవ్, నేతాజీ, శ్రీహరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


నవీన్ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: కారులో నిద్రిస్తున్న ఓ వ్యక్తి ఉదయం చూసేసరికి మృతిచెంది కనిపించాడని.. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన కథనం మేరకు.. జడ్చర్లలోని విజయ్‌నగర్‌కాలనీకి చెందిన సి.నవీన్ (32) శనివారం మహబూబ్‌నగర్‌లోని శ్రీనివాసకాలనీలో ఉండే స్నేహితుడు మురళి ఇంటికి వచ్చాడు. రాత్రి మద్యం తాగిన తర్వాత మురళి ఇంట్లో భార్యాపిల్లలు ఉన్నారనే కారణంగా ఇంటి ఎదుట కారులో పడుకున్నాడు. ఆదివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో నవీన్‌ను నిద్రలేపేందుకు మురళి వెళ్లగా కదలలేదు. వెంటనే దగ్గర్లోని ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నవీన్ మృతిపై అనుమానం ఉందని.. విచారణ చేపట్టాలని తండ్రి అశోక్ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

చేపలు పట్టేందుకు వెళ్లి..

జడ్చర్ల టౌన్: మండలంలోని ఆలూరు బూరుకుంటలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి నీట మునిగి మృతిచెందినట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన కుమ్మరి చంద్రయ్య (48), అక్బర్ ఇద్దరూ కలిసి శనివారం రాత్రి 7.30 సమయంలో చేపలు పట్టేందుకు బూరుకుంటకు వెళ్లారు. చంద్రయ్య నీటిలో దిగగా కాలుకు వల చుట్టుకుపోవడంతో మునిగిపోయాడని అక్బర్ కుటుంబసభ్యులకు సమాచారమిచ్చాడు. గ్రామస్తులు పలువురు చెరువులో వెదికినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఉదయం మృతదేహం నీటిలో తేలియాడుతూ కనిపించింది. కుమారుడు యోగానంద్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

వ్యక్తి బలవన్మరణం

గద్వాల క్రైం: ఉరేసుకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన గద్వాలలోని రెండో రైల్వేగేటు సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగించే మోహన్ (39)కు, కుటుంబసభ్యుల నడుమ కొన్నిరోజులుగా ఆర్థిక గొడవలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం మరోమారు వివాదం చోటు చేసుకోవడంతో మనస్థాపానికి గురై సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గుర్తించిన స్థానికులు, కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మోహన్‌కు భార్య పద్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మక్తల్‌లో మహిళ..

మక్తల్: ఉరేసుకొని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో ఆదివారం వెలుగు చూసింది. ఎస్‌ఐ పర్వతాలు కథనం మేరకు.. మక్తల్‌కు చెందిన వట్టం పద్మావతి కుమార్తె వరలక్ష్మి (30) హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో నాలుగేళ్లుగా విధులు నిర్వర్తిస్తుంది. ఉద్యోగం చేయడం ఇష్టం లేదని.. మానేస్తానంటూ వరలక్ష్మి తల్లికి చెప్పగా ఆర్థిక పరిస్థితులు బాగోలేవని ఉద్యోగం చేయాలని నచ్చచెబుతూ వచ్చింది. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో వరలక్ష్మి తన బెడ్‌రూంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని మృతిచెందింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

పుర్గర్‌చర్లలో విద్యార్థి..

వీపనగండ్ల: మండలంలోని పుర్గర్‌చర్లలో అనిల్(12) అనే విద్యార్థి ఆదివారం గ్రామ సమీపంలోని పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బక్కయ్య, పద్మ దంపతుల కుమారుడైన అనిల్ కల్వరాళ్ల ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. సాయంత్రం వరకు తల్లిదండ్రులతో కలిసి ఉన్న అతను పొలం వద్దకు వెళ్లి ఉరేసుకుని మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అనిల్ మృతికి కారణాలు తెలియాల్సి ఉందని, సంఘటనా స్థలాన్ని సందర్శించిన ఎస్‌ఐ రామన్‌గౌడ్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తమై శవాన్ని జిల్లా ఆస్పత్రికి పంపించనున్నట్లు తెలిపారు.

శ్రీరంగాపురంలో వ్యక్తి..

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన బాలస్వామి(55) అనే వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని ఆదివారం మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. శ్రీరంగాపురం గ్రామానికి చెందిన బాలస్వామి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని మృతి చెందాడు. చుట్టుపక్కల గమనించి వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందాడు.

మృతదేహం వెలికితీత

జడ్చర్ల: ఆలూరు సమీపంలోని చెక్‌డ్యాంలో శనివారం ఈతకు వెళ్లి గల్లంతైన మచ్చ విష్ణు (19) మృతదేహాన్ని ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు వెలికితీశారు. తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని తల్లి మచ్చ ఎల్లమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వేణు, ఎరుకల విష్ణు, మీనుగ అర్జున్ ఇంటి నుంచి తన కమారుడిని తీసుకెళ్లారని.. వారే సాయంత్రం వచ్చి చెక్‌డ్యాంలో మునిగిపోయాడని చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొంది. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు.

మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం

- మహబూబ్‌నగర్ ప్రధాన స్టేడియంలో కొనసాగుతున్న పనులు
- రూ.7.79 కోట్లు మంజూరు
- సెంట్రల్ ఏసీ, టెలిస్కోపింగ్ సీట్లు తదితర పనులకు ప్రతిపాదనలు


మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం

మహబూబ్‌నగర్ క్రీడలు: తెలంగాణాలో ఎక్కడాలేని విధంగా మహబూబ్‌నగర్‌లో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం జరుగుతోంది. జిల్లాలోని ఔత్సాహిక ఇండోర్‌గేమ్ క్రీడాకారుల ఏళ్ల కల నెరవేరబోతోంది. రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడలకు వేదికవుతున్న పాలమూరులో ఇండోర్ స్టేడియం అందుబాటులో లేకపోవడంతో షటిల్ బ్యాడ్మింటన్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్ రాష్ట్ర, జాతీయ పోటీలు జరగడం లేదన్న విమర్శలున్నాయి. రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి క్రీడాభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించడంతో ప్రధాన స్టేడియంలో అన్ని హంగులతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణమవుతుంది.

మరిన్ని వసతులకు ప్రతిపాదనలు..

మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో అదనపు క్రీడా వసతుల కోసం ఇటీవలే స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు ప్రతిపాదనలు పంపారు. సెంట్రల్ ఏసీ, ఆడియో సిస్టం, ప్రేక్షకులు పోటీలను తిలకించేందుకు అదునుగా అధునాతన టెలిస్కోపిక్ సీట్లు, వీఐపీ గ్యాలరీ ఏర్పాటు చేయనున్నారు.

క్రీడాకారులకు మెరుగైన వసతులు..

మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్ కోర్టు, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్‌హాల్ ఏర్పాటు కానుంది. అదేవిధంగా షటిల్ బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్, టెన్నికాయిట్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడాకారులకు మంచి అవకాశాలు లభిస్తాయి. భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయస్థాయి ఇండోర్ క్రీడా పోటీలు నిర్వహించే అవకాశం ఉంది.

ప్రతిపాదనలు ఇలా.. (రూ.లక్షల్లో..)	
సెంట్రల్ ఏసీ	165
ఎలక్ట్రికల్ సప్లయ్	45
ఆడియో సిస్టం	42
ఆటోమెటిక్ రిట్రాకబుల్ సీట్లు	140
గ్యాలరీ, పెయింటింగ్ స్పోర్ట్స్	55
మిగిలిన పనులు	76

రూ.7.79 కోట్లతో..

స్టేడియం నిర్మాణానికి రూ.7.79 కోట్లు మంజూరయ్యాయి. మంత్రి ఎప్పటికప్పుడు అధికారులకు దిశానిర్దేశం చేస్తూ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే గ్రౌండ్, రెండో అంతస్తులో పెవిలియన్, ఇతర గదుల పనులు పూర్తిచేశారు. ఇండోర్ స్టేడియం పైకప్పు పనులను ఇటీవలే పూర్తి చేశారు.


పైకప్పు నిర్మాణం

పనులు చురుగ్గా సాగుతున్నాయి..



మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషితోనే మెయిన్ స్టేడియంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పనులు పూర్తయితే క్రీడాకారులకు అన్నిరకాల వసతులు అందుబాటులోకి వస్తాయి. ఇండోర్ గేమ్స్ రెగ్యులర్‌గా ప్రాక్టిస్ చేసుకొనే అవకాశం ఉంటుంది. నిష్టాతులైన శిక్షకులు వస్తారు. అంతర్జాతీయ క్రీడాకారులను తయారుచేయవచ్చు.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్ఓ, మహబూబ్‌నగర్

ఆనందంగా ఉంది.



జిల్లాలో వేగంగా క్రీడాభివృద్ధి, స్టేడియాల నిర్మాణాలు జరుగుతున్నాయి. జిల్లాకేంద్రంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఇది ఔత్సాహిక క్రీడాకారులకు ఒక వరంలా మారనుంది. ఇండోర్ గేమ్‌లలో నైపుణ్యం గల క్రీడాకారులను వెలికితీయవచ్చు.

– గోటూరు శ్రీనివాస్‌గౌడ్, ప్రధానకార్యదర్శి

నిఖిత మృతిపై పారదర్శక విచారణ జరపాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

నాగర్‌కర్నూల్ రూరల్: మన్ననూరు గురుకుల పాఠశాల విద్యార్థిని నిఖిత మృతిపై అధికారులు పారదర్శక విచారణ జరపాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిఖితది ముమ్మాటికి హత్యేనని.. రుజువులు కూడా అవే చూపుతున్నాయని తెలిపారు. మృతిచెంది రోజులు గడుస్తున్నా అధికారులు ఎటూ తేల్చకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని.. రీపోస్టుమార్టంలోనూ మృతదేహంపై గాయాలు కనిపించాయని, ముమ్మాటికి హత్యేనని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు ఉద్యోగం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. నిఖిత మృతి విషయంలో టీచర్ గీతారాణి రాసిన లేఖను మీడియా ముందు చదివి వినిపించారు. ప్రభుత్వ సహకరాంతో నిందితులు తప్పించుకుంటున్నారని విమర్శించారు. బాధ్యులను కఠినంగా శిక్షించే వరకు వదిలేది లేదని.. విచారణలో జాప్యం చేస్తే దేశవ్యాప్తంగా ఉద్యమంతో పాటు రాజకీయ రగడకు నాంది పలుకుతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి ధర్మరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గూట విజయ్, మైనార్టీ ఫోరం నాయకుడు హబీబ్, ఎరుకల సంఘం నాయకుడు కురుకురు శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కోళ్ల శివ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం ఏకమవుదాం


మాట్లాడుతున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రంజిత్‌కుమార్

మల్దకల్: రాజ్యాధికారం బహుజనులంతా ఏకమవ్వాల్సిన అవసరం ఉందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రంజిత్‌కుమార్ అన్నారు. ఆదివారం నడిగడ్డ ఆత్మగౌరవ పాదయాత్ర తాటికుంట, నాగర్‌దొడ్డి, కుర్తిరావల్‌చెర్వు, చర్లగార్లపాడు, నీలిపల్లె గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ బహుజనులందరిని ఐకమత్యం చేయడం నడిహక్కుల పోరాట సమితి లక్ష్యమన్నారు. ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకగా ముందుండి పోరాటం చేస్తున్నామన్నారు. నడిగడ్డలో సరైన విద్య, వైద్యం అభివృద్ధి లేక వెనుకబాటుకు గురైందని ఆరోపించారు. కుటుంబ పాలనకు స్వస్తి పలుకుదామన్నారు. కార్యక్రమంలో నాయకులు చిట్టిబాబు, లవన్న, కిష్టన్న, విష్ణు, బీసన్న, లక్ష్మన్న, రాముడు, జమ్మన్న, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'నవీన్ కుటుంబాన్ని ఆదుకోవాలి'



చారకొండ: ప్రేమ వ్యవహారంలో స్నేహితుల చేతిలో అతి దారుణంగా హత్యకు గురైన నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్నేహితులు ఆనంద్, కళ్యాణ్, శ్రీకాంత్, శ్రీను, చిరంజీవి, రాజు కోరారు. ఆదివారం మండలంలోని వంకరాయితండాల్లో నవీన్ చిత్రాపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తండాకు చెందిన బీటెక్ విద్యార్థి నవీన్ హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్: మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓల్డ్‌మోతీనగర్‌లోని కమ్యూనిటీ హాల్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మైనార్టీ మహిళలకు మంత్రి కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ 8 ఏళ్లలో మైనార్టీల కోసం చేసిన అభివృద్ధి, సంక్షేమం గతంలో ఎవరూ చేయలేదన్నారు. ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. మైనార్టీ గురుకులాలు ఏర్పాటు చేసి నిరుపేద మైనార్టీ విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసినట్లు తెలిపారు. పట్టణంలో రూ.50లక్షలతో హజ్‌హౌస్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అన్ని మతాలను ఆదరించే సెక్యూలర్ ప్రభుత్వం మాదని, కాని కొందరు నాయకులు మాత్రం ఎన్నికలప్పుడే కులం, మతం పేరిట రాజకీయాలు చేస్తారన్నారు. అభివృద్ధి చేసే ఈ ప్రభుత్వాన్ని కాపాడుకునే బాధ్యత మీదని, కుల, మతాలకతీతంగా అందరూ కలిసి ముందుకు సాగాలని కోరారు. 36వ వార్డులో రూ.2.50 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామని, రూ.2 కోట్లతో గోదాం రోడ్డును విశాలంగా పునర్ నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేష్, నాయకులు ఖాజాపాష, నర్సింహులు, శివరాజ్, షఫీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మోతీనగర్ మసీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తారు విందులో మంత్రి పాల్గొన్నారు. 48వ వార్డు క్రిస్టియన్‌కాలనీలో రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును మంత్రి పర్యటించి వార్డులో పర్యటించారు. వార్డులోని ప్రతి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కారిస్తామని తెలిపారు.



ఇరుక్కుపోయింది!

పాలమూరు: జడ్చర్ల సమీపంలోని జాతీయ రహదారి అండర్ బ్రిడ్జి కింద నుంచి వెళ్లాలని లారీ డ్రైవర్ చేసిన ప్రయత్నంలో లారీ బ్రిడ్జికి తగిలి ఇరుక్కుపోయింది. ఆదివారం మధ్యాహ్నం ఈ ఘటన జడ్చర్ల నుంచి హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారి అండర్ బ్రిడ్జి దగ్గర కన్పించింది. బ్రిడ్జి కంటే లారీ ఎత్తు ఎక్కువగా ఉండటం వల్ల ఇరుక్కుపోయింది.

రామన్‌పాడులో 1,018 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,018 అడుగులు ఉన్నట్లు ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల ఎడమకాల్వ, సమాంతరకాల్వకు నీటి సరఫరా నిలిపివేశామని.. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 200 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

వెల్దండ: హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై మండల కేంద్రం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ మండలం అవురేష్‌పల్లికి చెందిన కాలమురి శేఖర్(40) హైదరాబాద్‌లోని మిదానిలో ఉంటూ తాపీమేస్త్రీ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. కాళ్లకు గాయాలు కావడంతో నాగనూలు వద్ద నాటువైద్యం చేయించుకొని తిరిగి హైదరాబాద్‌కు బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యంలోని వెల్దండ సమీపంలో బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో శేఖర్‌కు గాయాలుకావడంతో చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. శేఖర్‌కు భార్య సైదమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తండ్రి నర్సింహ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

నమాజ్‌కు వెళ్లి వస్తూ..

జడ్చర్ల: స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు. ఆయన కథనం మేరకు.. పట్టణంలోని జడ్చర్ల–కర్నూలు జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఓ హోటల్‌లో పని చేస్తున్న సలామ్ (45), ఫయాజ్ అహ్మద్ రహదారికి అటువైపు ఉన్న మసీద్‌లో నమాజ్ చేసేందుకు వెళ్లారు. తిరిగి హోటల్‌కు వచ్చేందుకు రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సలామ్ అక్కడికక్కడే మృతిచెందగా.. ఫయాజ్ అహ్మద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

రైలు ఢీకొని..

మానవపాడు: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలకేంద్రంలోని రైల్వేగేట్ సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన కథనం మేరకు.. 40 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తిని కాచిగూడ నుంచి మైసూర్ వెళ్లే రైలు సుమారు 10.30 గంటల సమయంలో రైల్వేగేట్ సమీపంలో ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గోధుమరంగు గళ్ల చొక్కా, నలుపురంగు నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడని.. ఎడమ చేతిపై బి.సరోజ అనే పచ్చబొట్టు ఉందన్నారు. శనివారం రాత్రి 7.10కి కర్నూలులో గద్వాల్ డిపో ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కి జల్లాపురం స్టేజీ సమీపంలో దిగినట్లు బస్ టికెట్ ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గద్వాల ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపర్చామని.. మరిన్ని వివరాలకు సెల్‌ఫోన్ నంబర్లు 94407 00031, 83090 67184 సంప్రదించాలని సూచించారు.

ఉచితంగా సరుకులు అందించాలి

నారాయణపేట టౌన్: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు 12 రకాల నిత్యావసర సరుకులు, 10 కిలోల సన్న బియ్యం ఉచితంగా అందించాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.కాశీనాథ్, పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక భగత్‌సింగ్ భవన్‌లో పీవైఎల్, పీఓడబ్ల్యూ ఏర్పాటుచేసిన సమావేశంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో కరోనా చావులకన్నా.. ఆకలి చావులే అధికంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టాలంటే ప్రజలకు తక్షణమే చౌక దుకాణాల ద్వారా సరుకులు, సన్న బియ్యం, అర్హులకు కొత్తరేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ.. ప్రజలపై పన్నుల భారం మోపుతోందని విమర్శించారు. వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి రాయితీ కూడా ఎత్తేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను దోచి కార్పొరేట్లకు మేలు చేకూర్చడం సరికాదన్నారు. సోమవారం నుంచి 15వ తేదీ వరకు గ్రామాలు, పట్టణాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపడతామని.. ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు శారద, ప్రతాప్, సౌజన్య, లక్ష్మి, సలీం, మాధవి, చంద్రకళ, మంజుల, సునీత పాల్గొన్నారు.

సేంద్రియ సాగు.. లాభాలు బాగు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్


జీలుగ సాగు (ఫైల్)


వర్మీకంపోస్టు ఎరువులో వానపాములు

అలంపూర్: పూర్వీకులు రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా సేంద్రియ విధానంలో పంటలు సాగు చేసేవారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార పంటల దిగుబడి పెంచడానికి ఆధునిక వంగడాలతో పాటు రసాయన ఎరువులు, పురుగు మందులు వాడాల్సిన అవసరం నెలకొంది. వీటిని అధికంగా వాడుతూ దిగుబడులు పెంచుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిస్థితులను అధిగమించి సేంద్రియ విధానంలో పంటల సాగు మేలని వ్యవసాయశాఖ ఏడీఏ సక్రియానాయక్ రైతులకు సూచించారు. వీటితో కలిగే లాభాలను రైతులకు వివరిస్తున్నారు.

రసాయనాల వాడకంతో..

రసాయన ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడటంతో వాటిని తట్టుకొనేస్థాయి పురుగులు, తెగుళ్లు కాలక్రమేణ అధికమవుతాయి. సాగు ఖర్చు విపరీతంగా పెరుగుతుంది. ఆహార ఉత్పత్తుల నాణ్యత తగ్గిపోతుంది. సరైన అవగాహన లేకుండా రసాయనాల వాడకంతో వాటి అవశేషాలు నీరు, నేలలో కలిసి కలుషితమవుతాయి.

నష్టాలు.. సూచనలు...

మితిమీరిన రసాయనాల వాడకంతో మిత్ర కీటకాలు నశించి వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. ఆరోగ్యం, పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ వ్యవసాయ ఒప్పందాల ప్రకారం నాణ్యమైన ఉత్పత్తులకే ప్రాధాన్యం ఇవ్వాలి. పంట ఉత్పత్తులు తక్కువ ధరలకు లభించేలా సాగు చేసుకోవాలి.

సేంద్రియ విధానం..

సాగులో లింగాకర్షన బుట్టలు వాడాలి. పరిమితులకు లోబడి బీటీ వైరస్ శిలీంద్రాన్ని వాడాలి. గంధకం, రాగి ఉత్పత్తులు వాడవచ్చు. వృక్ష సంబంధ నూనెల్ని కొన్ని జాగ్రత్తలతో వాడాలి. వేప సంబంధిత ఉత్పత్తులు, పచ్చిరొట్ట, వర్మీకంపోస్టు ఎరువులు వినియోగించాలి. పంట, కొబ్బరి వ్యర్థాలు, అజొల్లా ఉపయోగపడేవే. పంటల నుంచి వచ్చే బూడిద, జీవన ఎరువులు, జిప్సం పంటల్లో వాడుకోవచ్చు.

సేంద్రియ ఎరువులు..

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు తక్కువ ఖర్చుతో సాగు చేపడుతున్నారు. వానపాములు, పశువులు, కోళ్ల ఎరువు, పచ్చి ఆకులు, పిండి చెక్కలు వాడాలి.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్ రావు

'కాళేశ్వరం' పెట్టుబడి ఎప్పుడో వచ్చేసింది

- గోదావరి నీటితో పుష్కలంగా దిగుబడులు
- కేసీఆర్ అనే అద్భుత దీపంతో బంగారు పంటలు: హరీశ్‌రావు

సిద్దిపేట జోన్: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గోదావరి నీటితో పుష్కలంగా పంటలు పండుతున్నాయని, 2014లో రూ. 30.28 కోట్ల విలువైన ధాన్యం దిగుబడి రాగా గతేడాది రూ. 344.16 కోట్ల విలువైన ధాన్యం పండిందని, ఈ లెక్కన కాళేశ్వరం కోసం పెట్టిన పెట్టుబడి ఎప్పుడో వచ్చిందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం బంజరుపల్లి శివారులో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రానికి కేసీఆర్ అనే అద్భుత దీపం ఉందని.. దానివల్లే బంగారు పంటలు పండుతున్నాయన్నారు.

ధాన్యం కొనేందుకు కేంద్రానికి మనసు రాలేదు

మహారాష్ట్ర నుంచి 150 మంది రైతులు కాళేశ్వరం ప్రాజెక్టును చూసేందుకు రావడం రాష్ట్రానికి గొప్ప విషయమని హరీశ్‌రావు పేర్కొన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్న మహారాష్ట్రలోని షోలాపూర్‌లో నాలుగు రోజులకోసారి తాగునీరు వస్తుందని విమర్శించారు. రూ. 12 వేల కోట్ల అప్పును అదానీకి మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వానికి... రూ. 4 వేల కోట్లతో రైతులు పండించిన ధాన్యం కొనడానికి మనసు రాలేదని మంత్రి ఎద్దేవా చేశారు.

విపక్షాల ప్రచారం ప్రజలు నమ్మొద్దు..

బీజేపీ, కాంగ్రెస్‌ల గోబెల్స్ ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని, తెలంగాణ ఉద్యమ నినాదాలైన నీళ్లు, నిధులు, నియామకాలు సాధించేలా బీఆర్‌ఎస్ పనిచేస్తోందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఒకప్పుడు రాష్ట్రంలో కరువు ఉండేదని... గంజి, అంబలి కేంద్రాలు, రైతుల ఆత్మహత్యలు ఉండేవని... ఇప్పుడు గోదావరి నీటితో తెలంగాణ పల్లెలు సస్యశ్యామలం అయ్యాయని పేర్కొన్నారు. పేపర్ లీకేజీపై నిరుద్యోగులు ఆందోళన పడొద్దని, 6 నెలల్లో 80 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సింహ వాహనంపై సీతాపతి

వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



సింహ వాహనంపై ఊరేగుతున్న సీతాపతిని చూసి తన్మయులై నమస్కరిస్తున్న భక్తులు



సింహ వాహనంపై ఊరేగుతున్న సీతాపతి

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట మండలం ఏకశిలానగరిలోని శ్రీకోదండ రామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడవ రోజైన ఆదివారం వటపత్రశాయి అలంకారంలో కోదండ రాముడు భక్తులకు దర్శనమిచ్చారు. కేరళ వాయిద్యాలు, కోలాటాల నడుమ వేణుగాన నాథుడి గ్రామోత్సవం ఉత్సాహంగా సాగింది. రాత్రి 8 గంటల నుంచి 9.30 గంటల వరకు సింహ వాహనంపై సీతాపతి విహరించారు. భారీగా తరలివచ్చిన భక్తులకు అభయమిచ్చారు. టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిపారు.

నేడు నవనీత కృష్ణాలంకారం :

శ్రీకోదండ రామాలయంలో సోమవారం ఉదయం 8.00 గంటలకు నవనీత కృష్ణాలంకారంలో స్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రికి హనుమంత వాహనంపై కోదండ రాముడు ఒంటిమిట్ట పుర వీధుల్లో ఊరేగనున్నారు.

అడుగున్నర అందాల పెయ్యదూడ



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెం గ్రామానికి చెందిన గొలకోటి మాధవరావు ఇంట అడుగున్నర అందాల పెయ్యదూడ శనివారం రాత్రి జన్మించింది. ఫంక్షన్ సెట్టింగ్స్ ఆర్టిస్టు అయిన మాధవరావు వివిధ జాతుల ఆవులను పెంచుతుంటారు. 2019 అక్టోబర్ 28న ఓ కపిల ఆవుకు అరుదుగా ఉండే స్వర్ణ కపిల పెయ్య దూడ జన్మించి వార్తల్లోకి ఎక్కింది. ఆ స్వర్ణ కపిల ఆవు ఇప్పుడు 18 అంగుళాల పుంగనూరు పెయ్యదూడకు జన్మనిచ్చింది. ఈ అడుగున్నర అందాల పెయ్యదూడ అందర్నీ ఆకట్టుకుంటోంది.

టీడీపీలో నైరాశ్యం.. బాబు మౌన రాగం

175 స్థానాల్లో పోటీపై నోరు మెదపని వైనం

- సీఎంను ఓడించడానికి అందరూ ఏకం కావాలంటూ గగ్గోలు
- 50 నియోజకవర్గాల్లో అభ్యర్థులే లేని దుస్థితి
- పలు స్థానాల్లో రెండో స్థానం కూడా సందేహమే
- చెప్పుకోవడానికి ఏమీ లేకే ఈ కొత్త రాగం



సాక్షి, అమరావతి: ఏపీలోని 175 శాసనసభ స్థానాల్లో అభ్యర్థులనే ఎంపిక చేసుకోలేని దయనీయ స్థితిలో ఉన్న చంద్రబాబు.. 'అసలు సినిమా ముందుంది' అంటూ డాంబీకాలు పలకడంపై రాజకీయ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపును చూసి.. ఇది ట్రైలర్ మాత్రమేనని చెబుతున్న చంద్రబాబు, సార్వత్రిక ఎన్నికల్లో 175 శాసనసభ స్థానాల్లో పోటీ చేసే సత్తా ఉందా.. అన్న వైఎస్సార్‌సీపీ సవాల్‌పై మాత్రం ఇప్పటిదాకా స్పందించనే లేదు. చెప్పుకోవడానికి ఏమీ లేక.. ఏం చేస్తారో కూడా చెప్పలేక సతమతమవుతున్న 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే వృద్ధ జంబూకం.. పార్టీ శ్రేణులు పూర్తిగా కకావికలం కాకూడదని సరికొత్త డ్రామాకు తెర తీసింది. అందరం కలిసి సీఎం జగన్‌ను ఓడిద్దాం.. రండంటూ పొత్తులపై ప్రాణాలు పెట్టుకుని రాజకీయం చేస్తున్నారు. నిజంగా అసలు సినిమా ముందున్నది చంద్రబాబుకే. ఎందుకంటే.. ఒక్కో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం పరిధిలో 34 నుంచి 38 శాసనసభ స్థానాలు ఉంటాయి. వాటి పరిధిలో సుమారు 80 లక్షల మంది ఓటర్లు ఉంటారు. ఇందులో సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాల ద్వారా 87 శాతం కుటుంబాలకు చెందిన ఓటర్లకు ప్రయోజనం చేకూరింది. సంవత్సర ఆదాయం పట్టణాల్లో రూ.12 వేలు.. గ్రామాల్లో రూ.10 వేలలోపు ఉంటే ఆ కుటుంబాలను దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) ఉన్నట్లుగా గుర్తిస్తారు. ఆ కుటుంబాలకే సంక్షేమ పథకాలను వర్తింపజేస్తారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో ఓటర్లు సుమారు 2.50 లక్షల నుంచి మూడు లక్షల వరకు ఉంటారు. ఇందులో 80% ఓటర్లు సంక్షేమ పథకాల పరిధిలోకి వచ్చే అవకాశం లేదు. అలాంటి ఓటర్ల ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతో.. అదీ వామపక్షాలు, పీడీఎఫ్, యూనియన్లతో ఒప్పందం చేసుకుని గట్టెక్కడం అన్నది బలం కానే కాదని, వాపు అని అందరికంటే చంద్రబాబుకే బాగా తెలుసు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు కాని మహిళలు, మిగతా వారంతా రేపటి సార్వత్రిక ఎన్నికల్లో తమకు మేలు చేస్తున్న ప్రభుత్వం కోసం ఏకమైతే టీడీపీ స్థానం ఎక్కడుంటుందో ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. నిజంగా 50కి పైగా నియోజకవర్గాల్లో ఇప్పటికీ అభ్యర్థులే లేరు. మొత్తం 175 స్థానాల్లో టీడీపీకి రెండో స్థానం కూడా సందేహమేనని ఆ పార్టీ నేతలే బాహాటంగా చెబుతున్నారు. ఈ విషయంపై ప్రజల్లో ఎక్కువ చర్చ జరిగితే టీడీపీ పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని పక్కదోవ పట్టిస్తూ సరికొత్త రాజకీయ డ్రామాకు తెరలేపారు. ఇందుకు ఎల్లో మీడియా వంత పాడుతోంది.

వైఎస్సార్‌సీపీ ప్రయోగాత్మకంగా పోటీ

■ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సాధారణంగా వామపక్షాలు, పీడీఎఫ్, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు పోటీ చేసేవి. వాటికి ప్రధాన రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చేవి. ప్రధానంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు నుంచే వామపక్షాలు, పీడీఎఫ్, బీజేపీ, యూనియన్‌లు క్రియాశీలకంగా పని చేస్తాయి. కొన్ని దశాబ్దాలుగా తమ ప్రభావం ఉన్న వర్గాలనే ఎంచుకుని ఓటర్లుగా చేర్పిస్తున్నాయి.

■ అయితే ఇటీవల జరిగిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రయోగాత్మకంగా వైఎస్సార్‌సీపీ పోటీ చేసింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయపతాక ఎగురవేసింది. మూడు పట్టభద్రుల స్థానాల్లో పోటీ చేసిన టీడీపీ.. ప్రథమ ప్రాధాన్యత ఓట్లతో ఎక్కడా గెలవలేదు. కేవలం పీడీఎఫ్, సీపీఐ తదితర పక్షాలతో ఓట్ల బదిలీ ఒప్పందం కుదిరిన మేరకు.. ఆ వర్గాలు వేసిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతో గట్టెక్కింది.

■ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను అన్ని వర్గాల ప్రజల అభిప్రాయంగా భావించడానికి ఏమాత్రం వీల్లేదని, ఒకవేళ అలా భావిస్తే తనను తాను మోసం చేసుకోవడమేనన్నది చంద్రబాబుకు కూడా తెలుసని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. కేవలం టీడీపీ శ్రేణుల్లో నైతిక స్థైర్యాన్ని నింపడానికే.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల గెలుపు ట్రైలర్ మాత్రమేనంటూ చంద్రబాబు బీరాలు పలుకుతున్నారని విశ్లేషిస్తున్నారు.

అన్ని స్థానాల్లో సైకిల్ గుర్తు ఉంటుందా?

- వైఎస్సార్‌సీపీని ఎలా ఓడిస్తావ్ బాబూ?
- నిప్పులు చెరిగిన మాజీ మంత్రి పేర్ని నాని



సాక్షి, అమరావతి: ఏపీలో 175 శాసనసభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీని ఓడిస్తానంటూ ఏప్రిల్ 1న (ఫూల్స్ డే) టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బీరాలు పలుకుతూ సీఎం వైఎస్ జగన్‌ను దూషిస్తూ అలౌకిక ఆనందాన్ని పొందాడని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) మండిపడ్డారు. అసలు 175 నియోజకవర్గాల్లో సైకిల్ గుర్తుపై అభ్యర్థులను పోటీకి పెడతావా? అంటూ నిలదీశారు. మూణ్నెళ్ల క్రితం టీడీపీ నేతలతో సమావేశమై.. 38 నియోజకవర్గాలలో పార్టీకి ఇన్‌ఛార్జ్‌లే లేరంటూ వాపోయిన దిక్కుమాలిన స్థితి చంద్రబాబుదేనన్నారు. 'ముందు ఆ 38 నియోజకవర్గాలకు అభ్యర్థులను వెతుక్కో... కంగారెందుకు? ఎన్నికలకు మరో ఏడాది ఉంది కదా' అంటూ చంద్రబాబుకు హితవు పలికారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- 175 నియోజకవర్గాల్లో పవన్ కళ్యాణ్‌కు ఎన్ని ఇస్తున్నావ్? బీజేపీలో ఉంటూ టీడీపీ జెండా మోస్తున్న సత్యకుమార్, ఆదినారాయణరెడ్డి, సుజనా చౌదరి వంటి వారికి ఎన్ని సీట్లు ఇస్తున్నావ్?
- పేరుకేమో ఎర్ర జెండా. దాన్ని పసుపు రంగులో ముంచి భుజాన వేసుకుని తిరుగుతూ.. టీడీపీకి సీపీఐని తాకట్టు పెట్టిన నారాయణ, రామకృష్ణలకే సీట్లు ఇస్తావా? ఇంకెవరికైనా ఇస్తావా? ఇంకా రాహుల్ గాంధీకి ఎన్ని సీట్లు ఇస్తావ్? వీటిపై నీకు స్పష్టత ఉందా?
- ఇంత మందిని పోగేసుకుంటే కానీ సీఎం వైఎస్ జగన్‌పై పోటీకి వచ్చే ధైర్యం చంద్రబాబుకు లేదు. అయినా 75 ఏళ్ల వయసులో ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నారు. ఇంకా అబద్ధాలు, అసత్యాలు, మసిపూసి మారేడుకాయ చేయడం, ఏమార్చటాలు.. ఈ వయసులోనూ బాబు వీడ లేదు.
- 175 చోట్లా పోటీ చేసే దమ్ము లేదు. స్థోమతా లేదు. పది మందిని కలుపుకుంటేగానీ సీఎం వైఎస్ జగన్‌పై పోటీ చేసే సాహసం చేయలేని దుస్థితి. కొడుకు కలిసి రాడు. జనం మెచ్చుకోరు. అందుకే దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్, బావమరిది బాలకృష్ణతో తిరిగి.. సినిమా డైలాగ్‌లు రాయించుకుని పంచ్ డైలాగులు వదులుతున్నాడు.
- చంద్రబాబు ఎన్ని పార్టీలను పోగేసుకొని వచ్చినా, ప్రజల హృదయాల నుంచి సీఎం వైఎస్ జగన్‌ను ఇసుమంత కూడా తొలగించలేరు. 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీదే విజయం.

కుప్పంలో కార్యకర్త చేతిలో ఓడటం ఎందుకు?

- 'వైనాట్ పులివెందుల?' అంటున్నారు కదా.. అలా అనే వారందరినీ నేను ఆహ్వానిస్తున్నాను. పులివెందులలో జగన్ గారు ఓడిపోతారని కలలు కనే వారంతా వచ్చి పోటీ చేయండి. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్.. ఎవరైనా సరే పులివెందులలో పోటీ చేయొచ్చు. కుప్పంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల చేతిలో ఓడిపోవడం ఎందుకు? పులివెందులలోనే పోటీ చేయండి. అక్కడే ఇద్దరూ పోటీ చేసినా ఫరవా లేదు. మీరో.. మేమో తేలిపోతుంది.
- మొత్తం 21 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగితే చంద్రబాబు గెలిచింది కేవలం నాలుగు. గ్రాడ్యుయేట్స్‌లో మూడు, ఎమ్మెల్యే కోటాలో ఒకటి.. దానికే చంకలు గుద్దుకోవడం ఏమిటో? ప్రపంచాన్ని జయించినట్లు, ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించినట్లు ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నాడు.

రామయ్యకు గరుడవాహన సేవ



గరుడ వాహనసేవలో భక్తులు

చారకొండ: మండలంలోని సిర్సనగండ్లలో సీతారామచంద్రస్వామి బ్రహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఇదిలా ఉండగా శనివారం రాత్రి స్వామివారికి అభిషేకం, అర్చన, శివదత్తాత్రేయ, పరశురామ, అమ్మవారి ఆలయాల్లో అర్చనలు, రాత్రి ప్రదోష రాజోపచారములు, గరుడసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ధేరం రామశర్మ, ఈఓ రఘు, సిబ్బంది, పూజారులు లక్ష్మణ్‌శర్మ, మురళీధర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ హన్మంతు

నారాయణపేట రూరల్: చిన్న మొత్తాల పొదుపు పథకాలపై కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ నుంచి వడ్డీరేట్లు పెంచిందని.. సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడిజిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ హన్మంతు కోరారు. ఆదివారం జిల్లాకేంద్రానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. జూన్ 30 వరకు ఇది అమలులోకి ఉంటుందని తెలిపారు. సాధారణ సేవింగ్ రూ.500తో మొదలు ఏటా 4 శాతం వడ్డీతో పాటు చెక్ బుక్, ఆన్‌లైన్ సౌకర్యం ఉంటుందన్నారు. రూ.100 నుంచి ప్రారంభమయ్యే రికరింగ్ డిపాజిట్ ఐదేళ్లకు 6.2 శాతం వడ్డీ, టైమ్ డిపాజిట్ ఖాతా, నెలవారీ ఆదాయం, సీనియర్ సిటిజన్ ఖాతా, పబ్లిక్ ప్రావిడెంట్ ఖాతా, నేషనల్ సేవింగ్ సర్టిఫికేట్, కిసాన్‌మిత్ర, సుకన్య సమృద్ధి యోజన, మహిళా సేవింగ్ ఖాతా తదితర వాటిలో భాగస్వాములు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు దగ్గరలోని పోస్టాఫీసులో సంప్రదించాలని సూచించారు.

దేవాదాయశాఖలో బదిలీలేవి?

- 20 ఏళ్లుగా నిర్వహించని వైనం
- సాధారణ బదిలీల్లోనైనా అవకాశం దక్కేనా?



జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేస్తున్న పరిపాలన ఉద్యోగులకు 20 ఏళ్లుగా బదిలీలు కావడం లేదు. ప్రస్తుతం చేపట్టే సాధారణ బదిలీల ప్రక్రియలోనైనా మోక్షం లభించేనా? అని ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 626 ఆలయాల్లో 1,186 పరిపాలన సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా.. బదిలీల విషయంలో గతంలో జీఓనంబర్ 888లోని కొన్ని నిబంధనలు అడ్డొచ్చేవి. అయితే 2019లో ఆలయ ఉద్యోగులను బదిలీచేసే అంశంలో వెసులుబాటు కల్పిస్తూ ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం సదరు ఉద్యోగుల బదిలీలకు అనుకూలంగా జీఓను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. వాస్తవానికి ఉద్యోగులను దీర్ఘకాలంగా బదిలీ చేయకపోవడంతో పలుచోట్ల అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. బదిలీల ప్రకియ చేపడితే పారదర్శకత నెలకొనే అవకాశం ఉంది. బదిలీల విషయంలో ఆర్థికశాఖ నుంచి అనుమతులు, మార్గదర్శకాలు పూర్తవుతున్న తరుణంలో ఉద్యోగుల బదిలీలు జరగాలన్న వత్తిడి పెరుగుతోంది.

పరిపాలన సౌలభ్యం కోసమే..



చాలాకాలంగా ఒకే ఆలయంలో పనిచేస్తున్న సిబ్బందిని బదిలీ చేయాలి. దీంతో పారదర్శకత పెరుగుతుంది. స్థానిక నేతల నుంచి ఉద్యోగులపై వత్తిడి కూడా తగ్గుతుంది. కొత్తచోట మరింత ఉత్సాహంగా పని చేస్తారు. ఈ అంశాన్ని మంత్రి, కమిషనర్ దృష్టికి కూడా తీసుకెళ్లాం.

– జయపాల్‌రెడ్డి, జిల్లా ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, మహబూబ్‌నగర్

చట్ట సవరణ జరగాలి..



రెండు దశాబ్దాలుగా ఆలయాల్లో పనిచేసే పరిపాలన ఉద్యోగుల బదిలీలు జరగకపోవడానికి జీఓనంబర్ 888 అడ్డొచ్చేది. 2019లో అనుకూలమైన జీఓ వచ్చినప్పటికీ మరిన్ని చట్ట సవరణ జరగాల్సి ఉంది.

– శ్యాం, ఆలయ ఉద్యోగి,

రాక్షస రాజ్యాన్ని తరిమికొడదాం

ఇందిరమ్మ విగ్రహావిష్కరణలో ములుగు ఎమ్మెల్యే సీతక్క



రేచింతలలో ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ములుగు ఎమ్మెల్యే సీతక్క

అమరచింత: దేశం, రాష్ట్రంలో రాక్షసుల రాజ్యం కొనసాగుతోందని.. ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. మండలంలోని రేచింతలలో ఆదివారం రాత్రి ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించి అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ప్రజా సమస్యలను గాలికొదిలాయని.. పేదల సంక్షేమాన్ని విస్మరించి నిత్యావసర సరుకుల ధరలు పెంచాయని ఆరోపించారు. బడుగు, బలహీనవర్గాలను ఆదుకున్న ఘనత కాంగ్రెస్‌పార్టీకే దక్కిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటి వరకు గ్రామాల్లో ఇంటి నిర్మాణాలు జరగలేదని.. ఇప్పటికీ కాంగ్రెస్ పాలనలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లే కనిపించడం విశేషమని తెలిపారు. వ్యవసాయరంగాన్ని తుంగలో తొక్కి పెట్టుబడిదారులను అందలమెక్కించిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కిందని వివరించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట జిల్లాల అధ్యక్షులు జి.మధుసూదన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, వాకిటి శ్రీహరి, మక్తల్ నియోజకవర్గ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి అయూబ్‌ఖాన్, కార్యదర్శి మొగిలి గంగాధర్‌గౌడ్, ఆత్మకూర్ మండల, పట్టణ అధ్యక్షులు పరమేష్, శ్రీనివాసులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలకిష్టన్న, జూరాల ఎంపీటీసీ సభ్యుడు పరమేష్, అమరచింత మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గరీబోళ్ల రాజ్యం తీసుకొస్తాం..

ఒక్క అవకాశం ఇవ్వండి.. దేశంలో, రాష్ట్రంలో మరోమారు గరీబోళ్ల కలలుగన్న రాజ్యం తీసుకొచ్చి ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతామని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. ఆదివారం రాత్రి ఆత్మకూర్ చెరువుకట్ట వద్ద మైసమ్మ దేవతకు పూజలు చేసిన ఆమె ఆత్మకూర్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన కుటుంబాల నుంచి వచ్చిన రాహుల్‌గాంధీని తప్పుడు కేసుల్లో ఇరికించి పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయించి, తన నివాస బంగ్లాను ఖాళీ చేయాలని కోర్టు నుంచి తీర్పు ఇప్పించడం కేంద్ర ప్రభుత్వ నాటకమే అన్నారు. రాహుల్‌గాంధీకి వస్తున్న ప్రజాదరణను చూసి తట్టుకోలేకే ఇలాంటి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతుందని.. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు విస్మరించి వారి కుటుంబాలకు రాజకీయ పదవులు కట్టబెట్టుకున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమన్నారు.

పాలమూరు చిత్రకారుడికి జాతీయస్థాయి అవార్డు




సర్టిఫికెట్ అందుకుంటున్న మహేష్‌కుమార్

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రముఖ చిత్రకారులు శేషబ్రహ్మం ఏలూరి ఆధ్వర్యంలో కళాయజ్ఞం పేరుతో హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ ఆర్ట్ గ్యాలరీలో గత నెల 31 నుంచి ఆదివారం వరకు 143 మంది చిత్రకళాకారుల చిత్రకళా ప్రదర్శన నిర్వహించారు. ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో జిల్లాకు చెందిన చిత్రకారుడు జేపీ మహేష్‌కుమార్ పాల్గొని తాను గీసిన చిత్రాన్ని ప్రదర్శించారు. చివరి రోజు జరిగిన కార్యక్రమంలో మహేష్‌కుమార్ జాతీయస్థాయి మోస్ట్ ప్రామిసింగ్ అవార్డును ప్రముఖ చిత్ర కళాకారులు రమణారెడ్డి, రాజేష్, మోషే దయాన్‌ల నుంచి మెమొంటో, సర్టిఫికెట్ అందుకున్నారు. మహేష్‌కుమార్ జిల్లా కేంద్రంలోని పంచవటి స్కూల్‌లో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్నారు.

నిధులు కేంద్రానివి.. ఫొటోలు కేసీఆర్‌వి

మహారాష్ట్ర బీజేపీ మహిళామోర్చా ప్రధానకార్యదర్శి అశ్విని జిజికర్



కస్తూర్బా విద్యాలయ విద్యార్థులతో మాట్లాడుతున్న అశ్విని జిజికర్

దేవరకద్ర రూరల్: రాష్ట్రంలో అమలవుతున్న కొన్ని పథకాలకు కేంద్రం నుంచి నిధులు మంజూరవుతున్నా.. వాటిని కూడా తామే తీసుకొచ్చినట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ఫొటోలు వేయించుకొని రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని మహారాష్ట్ర బీజేపీ మహిళామోర్చా ప్రధానకార్యదర్శి అశ్విని జిజికర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు అందించే పౌష్టికాహారంతో పాటు కస్తూర్బా విద్యాలయాల్లో చదివే విద్యార్థులకు నిధులు మొత్తం కేంద్రం నుంచి అందుతాయని.. వాటిని తామే అందిస్తున్నట్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించుకోవడం సిగ్గుచేటన్నారు. అలాగే ఇటీవల నాందేడ్‌లో జరిగిన బహిరంగసభలో రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను పోటీలో నిలుపుతామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగల్భాలు పలికారని.. ఆ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. తెలంగాణాలో రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ కఠిన పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దేశం మొత్తం మోదీ పాలనను కోరుకుంటుందని.. తెలంగాణాలో గడీల పాలనను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధమయ్యారని తెలిపారు. అనంతరం డోకూర్ సమీపంలోని కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలు, భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు అంజన్‌కుమార్‌రెడ్డి, యజ్ఞ భూపాల్‌రెడ్డి, శేఖర్ తదితరులు ఉన్నారు.

'బీసీలపై దాడులు సరికాదు'



మాట్లాడుతున్న రాచాల యుగంధర్‌గౌడ్

కొత్తకోట రూరల్: బీసీలపై దాడులు చేస్తే ప్రతిదాడులు తప్పవని బీసీ పొలిటికల్ జేఏసీ తెలంగాణ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ హెచ్చరించారు. ఆదివారం పెద్దమందడిలో దాడికి గురైన సర్పంచ్ వెంకటస్వామిసాగర్‌ను పరామర్శించి దాడి జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెద్దమందడి మండలంలో మంత్రి నిరంజన్‌రెడ్డి అండతో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, అతడి సోదరుడు పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అక్రమాలు, అరాచకాలు ఎక్కువయ్యాయని, పేదల భూములు కబ్జా చేయడమేగాక రాత్రిళ్లు ఇసుక అక్రమ వ్యాపారం చేస్తూ అనేకమంది చావుకు కారణమయ్యారని ఆరోపించారు. సర్పంచ్‌కి పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తిని కబ్జా చేసేందుకు జగదీశ్వర్‌రెడ్డి యత్నిస్తున్నారని.. మూడేళ్ల కింద సర్వేకు దరఖాస్తు చేసుకున్నా, సర్వేయర్ రాకుండా అడ్డుకున్నారని, చివరకు తహసీల్దార్ ఆదేశాలతో శనివారం సర్వేయర్ వస్తున్నారని తెలుసుకొని ఎలాగైనా అడ్డుకోవాలన్న ఉద్దేశంతో సర్పంచ్, అతని కుటుంబ సభ్యులపై జగదీశ్వర్‌రెడ్డి సోదరులు దాడి చేశారని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఈ ఘటన జరిగిందని, గ్రామ ప్రథమ పౌరుడికి ఈ విధంగా జరిగితే సామాన్య ప్రజల సంతగేంటని ప్రశ్నించారు. సర్పంచ్ స్థలాన్ని కబ్జా చేయడానికి యత్నించడమే కాకుండా సర్పంచ్, అతడి కుటుంబ సభ్యులపై దాడి చేసిన జగదీశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివయాదవ్, నరేష్, వివేకానంద, యాదన్న, రమేష్ తదితరులు ఉన్నారు.